
సాక్షి
బాపట్ల
గురువారం । 8 । జూన్ । 2023



డీఎస్‌ఓగా పద్మ

గుంటూరు వెస్ట్: జిల్లా పౌరసరఫరాల అధికారి (డీఎస్‌ఓ)గా కోమలి పద్మ బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 520.50 అడుగుల వద్ద ఉంది. సాగర్ నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,100, గరిష్ట ధర రూ.2,500, మోడల్ ధర రూ.1,600 వరకు పలికింది.

న్యూస్‌రీల్

జూలై నాటికి ఎంపీ ల్యాడ్స్ పనులు పూర్తిచేయాలి

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: ఎంపీ ల్యాడ్స్ నిధుల (2019-23)తో మంజూరైన పనులను జూలై నాటికి పూర్తిచేయాలని అధికారులను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంపై సమీక్ష నిర్వహించారు. ఎంపీ, కలెక్టర్ మాట్లాడుతూ ఐదేళ్ల కాలానికి రూ.12.44 కోట్లతో 141 పనులు మంజూరు చేశామని వీటిలో రూ.5.40 కోట్లతో చేపట్టిన 98 పనులు పూర్తి కావడం, లేదా చివరి దశకు చేరుకోవడం జరిగినట్టు వివరించారు. మిగిలిన పనులను జూలై నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ, డీఆర్వో కె.వినాయకం, సీపీఓ ముక్తేశ్వరరావు, పీఆర్ ఈఈ సుబ్బారాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సురేశ్, ఏపీసీపీడీసీఎల్ డీఈ వై.ఏడుకొండలు, ఏపీఎంఎస్‌ఐడీసీ ఈఈ శ్రీధర్, దాచేపల్లి, గురజాల మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

11న జిల్లా పవర్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు

మంగళగిరి: నగరంలోని ఫిట్‌జోన్ ఆవరణలో ఈనెల 11న ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా మెన్, ఉమెన్ పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ సీనియర్ టీమ్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్టు కోచ్ ఎస్‌కే సంధానీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు సకల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగే ఈ సెలక్షన్స్‌లో అర్హత సాధించిన క్రీడాకారులను ఈనెల 24, 25 తేదీల్లో నెల్లూరు పట్టణంలో జరిగే ఆంధ్రప్రదేశ్ సీనియర్ స్టేట్ ఎక్యూప్డ్ మెన్, ఉమెన్ పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీలకు జిల్లా జట్టు తరఫున పంపనున్నట్టు తెలిపారు.

12న మెగా అప్రెంటిస్ మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు కలెక్టరేట్ వద్ద ఉన్న జిల్లాస్థాయి పారిశ్రామిక శిక్షణ సంస్థలో ఈనెల 12న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ సాయి వరప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తికల ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు విద్యార్హతల సరిఫికెట్ల జిరాక్స్ కాపీలు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఈనెల 12న ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 0863-2234720, 7386885639 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పసుపు క్వింటాలు రూ.6,850కి కొంటాం

జేసీ శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏపీ మార్క్‌ఫెడ్ పర్యవేక్షణలో రైతు భరోసా కేంద్రాలలోని కొనుగోలు కేంద్రాల ద్వారా పసుపు క్వింటాలును రూ.6,850కు బుధవారం నుంచి కొనుగోలు చేయనున్నట్టు జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ ఎల్.శివశంకర్ అధ్యక్షతన ఏర్పాటైన జిల్లా కొనుగోలు కమిటీ నిర్ణయించిందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు సమీపంలోని ఆర్‌బీకేలలో సంప్రదించాలని రైతులకు సూచించారు.

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలు

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, టాక్ట్ ఇంటర్నేషనల్, ఏసీఎస్ ఆర్టీసీ సంయుక్త ఆధ్వర్యంలో బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన అభ్యర్థులకు జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు బుధవారం తెలిపారు. నర్సింగ్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, రెండు సంవత్సరాల అనుభవంతో పాటు వయస్సు 35 సంవత్సరాల్లోపు ఉండాలని పేర్కొన్నారు. పాస్‌పోర్ట్ వినియోగంలో ఉండాలన్నారు. జర్మనీలో పనిచేసేందుకు సిద్ధపడిన వారంతా విజయవాడ కేఎల్ విశ్వవిద్యాలయంలో జూలై ఒకటో తేది నుంచి అందించే బీ1 స్థాయి జర్మన్ భాష ఉచిత ఆన్‌లైన్ శిక్షణ తరగతులకు హాజరుకావాలని ఆయన సూచించారు. దాదాపు రెండు నెలల పాటు రోజుకు ఆరు గంటల పాటు శిక్షణ ఉంటుందని వివరించారు. అభ్యర్థులకు విమాన చార్జీలతో పాటు జర్మనీలో మొదటి ఆరు నెలలు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారని పేర్కొన్నారు. వివరాలకు సంస్థ హెల్ప్‌లైన్ నంబర్ 9988853335లో సంప్రదించాలని తెలిపారు.

వృద్ధాశ్రమాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

నెహ్రూనగర్(గుంటూరు): జిల్లాలో వృద్ధుల ఆశ్రమం నడుపుతున్న నిర్వాహకులు తప్పనిసరిగా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ సువార్త బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 9959127045లో సంప్రదించాలని సూచించారు.

హజ్ రామరం

- గుంటూరు గడ్డపై పవిత్ర ఘట్టం
- యాత్రికుల కోసం నంబూరు మదరసాలో ప్రత్యేక కేంద్రం
- గతంలో ఎప్పుడూ లేని విధంగా ఏపీ నుంచే నేరుగా ప్రయాణం
- ప్రత్యేక వసతులు కల్పించిన ప్రభుత్వం
- ఇమిగ్రేషన్ ప్రక్రియ అంతా మదరసాలోనే..
- హాజీలు, ముస్లిం సంఘాల నేతల హర్షం



హజ్ యాత్రికులకు డ్రైఫ్రూట్స్ అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

ఏఎన్‌యూ(గుంటూరు): ముస్లింల హజ్ యాత్ర పవిత్ర ఘట్టానికి గుంటూరు వేదికగా నిలిచింది. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 1,814 మంది హాజీలు హజ్ యాత్రకు వెళ్తున్నారు. ఈనెల 7 నుంచి 19 వరకు వీరి ప్రయాణాలు సాగనున్నాయి. వీరు గుంటూరు నుంచే నేరుగా హజ్‌కు వెళ్ళేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ మేరకు గుంటూరు జిల్లాలోని నంబూరు గ్రామ పరిధిలోని మదరసా ఏ-సిరాజుల్-ఉలుమాలో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. యాత్రికులు, వారి కుటుంబీకులకు అన్ని వసతులూ ఏపీ హజ్ కమిటీ ఆధ్వర్యంలో కల్పించింది.

- యాత్రికులు చేసుకోవాల్సిన ప్రార్థనలు, పాటించాల్సిన నియమాలపై మత పెద్దలతో అవగాహన కల్పించారు.
- నంబూరు మదరసాలో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి హజ్ యాత్ర ఘనతలు ప్రసారం చేశారు.
- విదేశీ కరెన్సీని మార్చుకునేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు.
- ఏర్పాట్లను ఎమ్మెల్యేలు కిలారి వెంకట రోశయ్య, మహ్మద్ ముస్తఫా, గుంటూరు నగర డెప్యూటీ మేయర్ షేక్ సజిల, ముస్లిం సంఘాల నాయకులు ప్రత్యేకంగా పర్యవేక్షించారు.

పాస్‌పోర్టు వెరిఫికేషన్ నుంచి సీట్ల కేటాయింపు వరకు..

యాత్రికులకు సంబంధించిన పాస్‌పోర్ట్ వెరిఫికేషన్, బోర్డర్ పాస్ ఆమోదం, లగేజ్ చెకప్, ప్రయాణికులకు విమానంలో సీట్ల కేటాయింపు వంటి ఇమిగ్రేషన్ ప్రక్రియ అంతా విమానాశ్రయ సిబ్బంది నంబూరు మదరసాలోనే పూర్తి చేసేలా ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీంతో కొందరు యాత్రికులు బుధవారం ఉదయం ఐదు గంటలకు నమాజ్‌లో పాల్గొన్న అనంతరం ప్రత్యేక ప్రార్థనల్లో పాలుపంచుకున్నారు. అక్కడి నుంచే ప్రత్యేక బస్సులలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు వెళ్ళారు. ప్రభుత్వం కల్పించిన ప్రత్యేక వసతులపై యాత్రికులు, ముస్లిం నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగేళ్లుగా యత్నిస్తున్నా



హజ్ యాత్రకు వెళ్లాలని నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్నా. ఆ కోరిక ఇప్పుడు నెరవేరింది. ఏపీ నుంచి నేరుగా హజ్‌కు వెళ్ళేందుకు ఏపీ ప్రభుత్వం ఏర్పాట్లు చేయడం హర్షణీయం. రాష్ట్ర ప్రభుత్వానికి అల్లా ఆశీస్సులు ఉంటాయి.

– మహ్మద్ యాకూబ్ బేగ్, యాత్రికుడు, గుంటూరు

సీఎం చొరవ అభినందనీయం



హజ్ యాత్రపై సీఎం వైఎస్ జగన్ తీసుకున్న ప్రత్యేక చొరవ అభినందనీయం. ఏపీ నుంచే నేరుగా హజ్‌కు విమాన ప్రయాణం ఏర్పాటు చేయడంతోపాటు యాత్రికుల టికెట్ ధరలో వచ్చిన తేడాను ప్రభుత్వమే భరించి ఆదుకుంది. ఇంతకు ముందెప్పుడూ ఇలాంటి ప్రోత్సాహకం లేదు.

– షేక్ మునీర్ అహ్మద్, ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్

మహిళలకు ప్రత్యేక వసతులు కల్పించారు



యాత్రకు వెళ్ళే మహిళల కోసం ప్రత్యేక వసతులు కల్పించారు. విశ్రాంతి గదులు, భోజన వసతి, ప్రార్థనా సౌకర్యాలను సమకూర్చారు. సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

– ఎస్.రిహానా, యాత్రికురాలు, వైఎస్సార్ కడప

ఏర్పాట్లు భేష్



హజ్ యాత్రికులకు ఇప్పుడు కల్పించిన వసతులు గతం కంటే ఎంతో బాగున్నాయి. ఎండలు తీవ్రంగా ఉన్నా.. నంబూరు మదరసాలో ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఏసీ అమర్చింది. నాణ్యమైన ఆహారం అందించింది. తాగు నీటి వసతి కల్పించింది.

ఆర్.సికిందర్, యాత్రికుడు, విజయనగరం

కుటుంబంతో వెళ్లాలన్న కోరిక నెరవేరింది



కుటుంబంతో కలిసి హజ్ యాత్రకు వెళ్లాలనే నా జీవిత ఆశయం ఇప్పుడు నెరవేరింది. నేను గతంలోనూ హజ్ యాత్రకు వెళ్ళాను. కానీ గతంలో కంటే ఇప్పుడు మంచి ఏర్పాట్లు చేశారు. ఏపీ నుంచే నేరుగా హజ్ యాత్రకు వెళ్ళే ఏర్పాటు చేయడం బాగుంది.

– షేక్ హుస్సేన్ పీరా, యాత్రికుడు, వైఎస్సార్ కడప.

ప్రార్థనల గురించి బాగా చెప్పారు



హజ్ యాత్ర సందర్భంగా చేసుకోవాల్సిన ప్రార్థనలు, నియమాలు ఉమ్రా గురించి మత పెద్దలు చాలా బాగా వివరించారు. దీని కోసం మదరసాలో ప్రభుత్వం ప్రత్యేక సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం. ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు.

– మహ్మద్ ఇస్సాఖ్, యాత్రికుడు, వైఎస్సార్ కడప

సీఎం కార్యక్రమ ఏర్పాట్ల పరిశీలన



సీఎం కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి

మంగళగిరి: క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) కార్యక్రమంలో భాగంగా 516 ఈ-ఆటోలను తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం నుంచి గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి అక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి కార్యక్రమానికి సంబంధించి సభా స్థలి ఏర్పాట్లు, బారికేడ్లు, వాహనాల పార్కింగ్, పారిశుధ్యం తదితర అంశాలపై కలెక్టర్ అధికారులతో చర్చించి సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, ఎంటీఎంసీ కమిషనర్ యు.శారదాదేవి, తాడేపల్లి తహసీల్దార్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాన బీభత్సం



నేలకొరిగిన వృక్షం

వినుకొండ టౌన్: పట్టణంలో బుధవారం సాయంత్రం వాన బీభత్సం సృష్టించింది. భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగింది. రేకుల షెడ్లు, పూరి గుడిసెలు కూలాయి. ప్రధానంగా కారంపూడి రోడ్డులోని కళ్యాణపురి కాలనీ సమీపంలో దాదాపు 10 వరకు భారీ వృక్షాలు నేలకొరిగాయి. ఈ దారిలో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. దాదాపు 2 గంటలపాటు రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచాయి.

కట్టుకున్న భర్తే కాలయముడై..

- భార్య మెడ భాగంలో చేతులతో మోది హత్య
- ఆనక ఎలుకల మందు తిని ఆత్మహత్యయత్నం
- సత్తెనపల్లి రంగా కాలనీలో దారుణం
- అనుమానమే కారణం!
- పోలీసులకు లొంగిపోయిన నిందితుడు!



అరుణ



కార్తీక్ (ఫైల్ ఫొటోలు)



అరుణ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ శోభన్‌బాబు

సత్తెనపల్లి: భార్యపై అనుమానంతో కోపం పెంచుకొని కట్టుకున్న భర్తే ఆమె మెడపై చేతులతో మోది హతమార్చిన ఘటన సత్తెనపల్లి పట్టణంలోని రంగా కాలనీ 11వ లైన్‌లో జరిగింది. సత్తెనపల్లి టౌన్ సీఐ యు.శోభన్‌బాబు కథనం ప్రకారం.. పట్టణంలోని రంగాకాలనీ 11వ లైన్‌కు చెందిన పల్లపు అరుణ(18), సత్తెనపల్లి మండలం భీమవరం గ్రామానికి చెందిన ఒంటిపులి కార్తీక్ మూడేళ్ల క్రితం ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. ఎంతో అన్యోన్యంగా జీవించేవారు. వీరికి ఏడాదిన్నర వయస్సు కలిగిన కుమార్తె అఖిలాండేశ్వరి ఉంది. కార్తీక్ భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. కార్తీక్ స్థానికంగా పనులు లేనప్పుడు హైదరాబాద్ వెళ్లి నిర్మాణ రంగ పనుల్లో కొంత కాలం పని చేసి వచ్చి పోతుంటాడు. ఈ క్రమంలో భార్య అరుణ ప్రవర్తనపై అనుమానం పెంచుకున్నాడు. దీనిపై కొంతకాలంగా భార్యాభర్తలిద్దరూ గొడవ పడుతున్నారు. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలోనూ ఇద్దరూ గొడవ పడ్డారు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కార్తీక్ మద్యం తాగి వచ్చి భార్య అరుణతో వాదనకు దిగాడు. కోపోద్రిక్తుడై చేతులతో ఆమె మెడ భాగంలో బలవంతంగా మోదాడు. దీంతో అరుణ అక్కడికక్కడే పడిపోయి మరణించింది. భయాందోళనకు గురైన కార్తీక్ తాను కూడా చనిపోవాలని నిర్ణయించుకుని ఎలుకల మందు తిని ఆత్మహత్యకు యత్నించాడు. అనంతరం అతను ఆస్పత్రికి వెళ్లాడు. ప్రాణానికి ఎలాంటి అపాయం లేదని వైద్యులు చెప్పడంతో కొద్దిసేపటికి పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు సమాచారం. ఘటనా స్థలాన్ని పట్టణ సీఐ యు.శోభన్‌బాబు, తహసీల్దార్ కె.నగేష్, సిబ్బంది సందర్శించి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతురాలి తల్లి కోటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగ ఉత్సాహం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంత్రివర్గ నిర్ణయాలపై హర్షం

గుంటూరు మెడికల్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. దీనిలో భాగంగా బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశం వరాల జల్లు కురిపించింది. కాంట్రాక్టు ఉద్యోగుల రెన్యూవల్‌తోపాటు నెలరోజుల ముందే పీఆర్సీ కమిటీ నియామకం, సీపీఎస్ రద్దు వంటి అంశాలపై నిర్ణయం తీసుకుంది. వీటిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఉద్యోగవర్గాలు ఆనందంతో జై జగన్ అంటూ నినదిస్తున్నాయి. పలువురు ఉద్యోగుల మనోగతం ఇదీ..

సీపీఎస్ రద్దు భేష్



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. సీపీఎస్ రద్దు చేసినందుకు ధన్యవాదాలు. జీపీఎస్ బిల్లు హర్షణీయం.

- ప్రేమజ్యోతిబాబు, వైఎస్సార్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

స్వాగతిస్తున్నాం



సీపీఎస్‌ను రద్దు చేస్తూ జీపీఎస్‌ను ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నాం. ఓపీఎస్‌ను తిరిగి అమలు చేయటం ఏ ప్రభుత్వానికీ సాధ్యపడదు.

- కె.వి.సుబ్బారెడ్డి, ఉపాధ్యాయుడు, ఎస్టీయూ

హర్షణీయం



సీపీఎస్ రద్దు చేస్తూ రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం హర్షణీయం. జీపీఎస్‌లో ఏముందో పరిశీలించాల్సి ఉంది. దీంతోపాటు పీఆర్సీ కమిటీ నియామకం, జిల్లా కేంద్రాలలో హెచ్‌ఆర్‌ఏ పెంపు వంటి నిర్ణయాలను స్వాగతిస్తున్నాం.

- కొండ్రు మోహనరావు, ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు

పీఆర్సీ కమిటీ నియామకం మేలు



మంత్రివర్గ నిర్ణయాలను స్వాగతిస్తున్నాం. డీఏ పెంపుతో ఉద్యోగులకు ఎంతో మేలు జరుగుతుంది. పీఆర్సీ కమిటీ నియామకం మేలే.

- ఓంకార్, రెవెన్యూ అసోసియేషన్ కోశాధికారి

ఉద్యోగుల పక్షపాతి సీఎం జగన్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగుల పక్షపాతి. ముఖ్యంగా నెల రోజులు ముందుగానే పీఆర్సీ కమిటీని నియమించడం గొప్ప విషయం. కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ నిర్ణయం భేష్. ఇది ఉద్యోగ ప్రభుత్వం అనేందుకు ఈ అంశాలే నిదర్శనం. ఏపీ ఎన్జీఓ గుంటూరు జిల్లా శాఖ తరఫున ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– ఘంటసాల శ్రీనివాసరావు, ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు

సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం



గత ప్రభుత్వాలు కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ఎన్నో హామీలు ఇచ్చి మాట తప్పాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి సంచలన నిర్ణయం తీసుకున్నారు. 10వేల మందికిపైగా కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాలు మారిపోనున్నాయి. ముఖ్యమంత్రికి కాంట్రాక్టు ఉద్యోగులు జీవితాంతం రుణపడి ఉంటారు.

– సంతోష్ మాతృకుమార్, కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల అసోసియేషన్ నాయకుడు

పేదలందరికీ ఇళ్లు జగన్ సంకల్పం

మంత్రి మేరుగ నాగార్జున



మున్నంగి వారి పాలెం గ్రామంలో జగనన్న కాలనీల్లో ఇళ్లు ప్రారంభించిన మంత్రి మేరుగ నాగార్జున

మున్నంగివారిపాలెం(వేమూరు): పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహా సంకల్పమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున చెప్పారు. చుండూరు మండలంలోని నడిగడ్డవారిపాలెం, మున్నంగివారిపాలెం గ్రామాల్లో ఎస్సీ కాలనీలో ఏపీ గృహ నిర్మాణ సంస్థ, వీఆర్‌ఓ సంస్థ ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించిన జగనన్న కాలనీ ఇళ్లను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, బాపట్ల కలెక్టర్ రంజిత్ బాషా, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే, ఏపీ గృహ నిర్మాణ సంస్థ ఎండీ లక్ష్మీషా, వీఆర్‌ఓ సంస్థ అధ్యక్షులు విశ్రాంతి ఐఏఎస్ అధికారి టి.గోపాలరావు ప్రారంభించారు. మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. జగనన్న కాలనీలను సుందరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ బాపట్ల జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో 31 వేల ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 8,500 ఇళ్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. 12 వేల ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. కాంతిలాల్‌దండే మాట్లాడుతూ ఎస్టీలకు ఇళ్ల నిర్మాణం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జాలాది రూబేను, జెడ్పీటీసీ దాట్ల సౌజన్య, గ్రామ సర్పంచ్‌లు వుయ్యూరి అప్పి రెడ్డి, సునీత సురేష్, విజయబాబు, మండల పార్టీ అధ్యక్షులు గాదె శివరామ కృష్ణ రెడ్డి, ఎంపీటీసీ పోన్నూరు వెంకట రమణ పాల్గొన్నారు.

మేరా జగన్ మహాన్

థాంక్యూ సీఎం సార్

- రూ.9 కోట్ల విలువైన 20 సెంట్ల స్థలం మసీదుకు కేటాయింపు
- రాష్ట్ర మంత్రివర్గ తీర్మానం
- మంత్రి అంబటి చొరవతో సాకారం
- పట్టణ ముస్లింల హర్షం



పట్టణంలో మస్జిద్-ఈ-అఖ్సాకు కేటాయించిన స్థలం

సత్తెనపల్లి: గుంటూరు-మాచర్ల ప్రధాన రహదారిలో పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణ పరిధిలోని ఎస్‌ఎస్సీ కాలనీలో రూ. 9 కోట్ల విలువైన 20 సెంట్ల స్థలాన్ని మస్జిద్-ఈ-అఖ్సాకు కేటాయిస్తూ రాష్ట్ర మంత్రి మండలి బుధవారం తీర్మానం చేసింది. 25ఏళ్లుగా ఇక్కడ తాత్కాలిక షెడ్డులో నమాజ్ చేసుకుంటున్న ముస్లిం సోదరుల వినతి మేరకు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేక చొరవతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ముస్లింలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మేరా జగన్ మహాన్.. థాంక్యూ సీఎం సార్ అంటూ నినదిస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టు పరిధిలో పనిచేస్తున్న ముస్లిం ఉద్యోగులు సత్తెనపల్లి పట్టణంలో ఎస్‌ఎస్సీ కాలనీ వద్ద 20 సెంట్ల స్థలంలో 25ఏళ్ల క్రితం నెలకు రూ. 18 అద్దె ప్రాతిపదికన నమాజ్‌లు చేయడం ప్రారంభించారు. అనంతర కాలంలో తాత్కాలిక కట్టడం, ప్రహరీ ఉద్యోగులే వారి సొంత ఖర్చుతో నిర్మించుకున్నారు. మున్సిపాలిటీ నుంచి మంచినీటి వసతి లభించింది. రోజూ సుమారు రెండు వందల మంది నమాజ్‌లకు హాజరవుతుండగా శుక్రవారం, ఇతర పండుగ దినాలలో 500 నుంచి 600 మంది ఇక్కడ ప్రార్థనలు చేస్తారు.

బాపట్ల జిల్లా పశువైద్యుల సంఘం ఎన్నిక



డాక్టర్ చలపతిరావును అభినందిస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి హనుమంతరావు

చుండూరు(తెనాలి): ఆంధ్రప్రదేశ్ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ సర్వీస్ అసోసియేషన్, బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా వేమూరు నియోజకవర్గం చుండూరు మండల పశువైద్యాధికారి చల్లా చలపతిరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బాపట్లలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో బుధవారం అసోసియేషన్ ప్రథమ కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కె.మహేష్, కోశాధికారిగా డాక్టర్ ఎం.కిరణ్, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ టి.శివారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ ఎ.ప్రవీణ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.రాం నరేష్, పరిశీలకులుగా డాక్టర్ కె.చంద్రశేఖరరెడ్డి వ్యవహరించారు. జిల్లా ప్రథమ కార్యవర్గాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ మద్దు హనుమంతరావు అభినందించారు. ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ చలపతిరావు గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడిగా, కోశాధికారిగానూ వ్యవహరించారు. పశువైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు.

కొద్ది గంటల్లో కుమారుడి అన్నప్రాశన..

- పట్టాలపై శవమైన తండ్రి
- హతమార్చారని ఆరోపించిన కుటుంబ సభ్యులు

తెనాలిరూరల్: మరికొద్ది గంటల్లో కుమారుడి అన్న ప్రాశన కార్యక్రమం జరుగనుంది.. ఏమైందో ఏమో తెలియదు గాని తండ్రి రైలు పట్టాలపై శవమై పడి ఉన్నాడు. ఘటనపై మృతుడి కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం బొద్దులూరుపాడు గ్రామానికి చెందిన బెల్లంకొండ నాగరాజు (32) సుమారు ఆరేళ్లుగా తెనాలిలో ఉంటూ చికెన్ షాపులో పనిచేస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. బుధవారం కుమారుడి అన్న ప్రాసన కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఏమైందో ఏమో నాగరాజు చినరావూరు రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై మృతి చెంది కనిపించాడు. అతను పనిచేసే షాపు యజమాని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడని మృతుడి భార్య ప్రవల్లిక ఆరోపిస్తోంది. తమ ఇంటి కాగితాలు చికెన్ షాపు యజమాని మురళి వద్ద ఉంచుకుని వేధిస్తున్నడని తెలిపింది. కుమారుడి అన్నప్రాశన ఉంది సెలవు కావాలన్నా ఇవ్వలేదని, ప్రశ్నించినందుకే హత్య చేసి పట్టాలపై పడేసి ఉంటాడని వాపోయింది. ఘటనా స్థలాన్ని తెనాలి జీఆర్పీ పోలీసులు పరిశీలించారు. ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నామని, విచారణలో వివరాలు వెల్లడవుతాయని ఎస్ఐ ఎల్.సరస్వతి తెలిపారు.

ఫిష్ ఆంధ్రా యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలి

బాపట్ల జిల్లా మత్స్యశాఖ అధికారి డాక్టర్ సురేష్

చేబ్రోలు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు, మత్స్యకారులు రాయితీపై అందిస్తున్న ఫిష్ ఆంధ్రా యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని బాపట్ల జిల్లా మత్స్యశాఖాధికారి డాక్టర్ పి.సురేష్ అన్నారు. పొన్నూరులోని నిడుబ్రోలు మత్స్య క్షేత్రంలో బుధవారం నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు, మత్స్య శాఖ ఆధ్వర్యంలో మండలంలోని మత్స్యకారులకు 'మంచినీటి చెరువులలో చేపల పెంపకం'పై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం జరిగింది. ముగింపు కార్యక్రమంలో పి.సురేష్ మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా సబ్సిడీపై అందజేస్తున్న యూనిట్లు డొమెస్టిక్ మార్కెటింగ్ ద్వారా ఫిష్ ఆంధ్ర షాపుల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. రంగు చేపల పెంపకం వల్ల ఉపయోగాలు చేపల పెంపకంలో అధునాతన టెక్నాలజీ (రిసర్క్యులేటరీ ఆక్వాకల్చర్ సిస్టం)పై అవగాహన కల్పించారు. నగరం మండలం పమిడిమర్రు గ్రామంలోని సర్కులేటరీ ఆక్వా కల్చర్ సిస్టం యూనిట్‌ను ఫీల్డ్ విజిట్ ద్వారా మత్స్యకారులకు అవగాహన కల్పించారు. గుంటూరు జిల్లా మత్స్య శాఖాధికారి గాలిదేవుడు, మత్స్యశాఖాధికారులు బి.కృష్ణ కిషోర్, జైనుల్లా ఖాన్, ప్రశాంత్ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ

- కొండభొట్లవారిపాలెంలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ
- మాతృభూమిలో ఆలయాన్ని నిర్మించిన ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి
- హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు



ఆలయం సందర్శించిన ఎంపీలు విజయసాయిరెడ్డి, అయోధ్యరామిరెడ్డి, మోపిదేవి, ఎమ్మెల్సీ ఉమారెడ్డి

బాపట్ల అర్బన్: బాపట్ల మండలంలోని కొండభొట్లవారిపాలెంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు స్వగ్రామంలో ఆయన సొంత నిధులతో నిర్మించిన వేంకటేశ్వరస్వామి, వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్యేలు కోన రఘుపతి, కిలారి రోశయ్య హాజరయ్యారు. వారు మాట్లాడుతూ సీనియర్ నాయకులు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తన స్వగ్రామంలో ఆధ్యాత్మిక క్షేత్రాన్ని నిర్మించి పుట్టిన ఊరి రుణం తీర్చుకున్నారని చెప్పారు. సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి అందించే మహత్తర కార్యాన్ని తీసుకున్న ఉమ్మారెడ్డికి అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని, ఇది సామాజిక మార్పునకు దారి తీస్తుందని చెప్పారు. ఆలయ శాశ్వత ధర్మకర్త, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మాతృభూమిలో ఆలయాన్ని నిర్మించే పుణ్యఫలం దక్కడం ఎంతో సంతోషంగా ఉందని, ఇది తన పూర్వ జన్మ సుకృతమని చెప్పారు. అనంతరం ఉమ్మారెడ్డి వెంకటరమణ, వీర గణేష్, వీరేంద్రకుమార్ కుటుంబ సభ్యులతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మల్లి కార్జునరావు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయాల ప్రతిష్ఠాపన పూజలు

అనంతరం వరసిద్ధి వినాయక, మహాలక్ష్మీ, ద్వారపాలక, గరుడ, మూషిక, నాగరాజ, గణేశ అయ్యప్ప, విమాన రాజగోపుర, జీవధ్వజ బలిపీఠ శ్రీ భూ, సమేత శ్రీవెంకటేశ్వర స్వామి వార్ల ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు చేపట్టారు. తిరుమల తిరుపతి ఆగమ పండితులు శ్రీ మాన్ రంగాచార్యులు ఆధ్వర్యంలో మహా పూర్ణాహుతిని అత్యంత భక్తిశ్రద్ధలతో చేపట్టారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర స్వామి, లక్ష్మీదేవి, వినాయక, అయ్యప్ప స్వామి మూర్తులకు కుంభాభిషేకం, ప్రాణ ప్రతిష్ఠ, మహా సంప్రోక్షణ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పది వేల మంది భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అన్నదానం చేపట్టారు. కార్యక్రమాలను కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్ పర్యవేక్షించారు.



ప్రత్యేక పూజలు చేసి, ఆశీర్వచనం తీసుకుంటున్న ప్రభుత్వ సలహాదారు సజ్జల తదితరులు

జెడ్పీటీసీ సభ్యులకు ముగిసిన శిక్షణ

బాపట్ల అర్బన్: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో మూడు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో గుంటూరు, కృష్ణా జిల్లా ప్రజా పరిషత్‌లకు చెందిన 50 మంది జెడ్పీటీసీ సభ్యులకు మూడు రోజులు రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈటీసీ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జిల్లా పరిషత్ ఏర్పాటు సభ్యులు ఎన్నిక, జెడ్పీటీసీ సభ్యుల విధులు, అధికారాలు బాధ్యతలు, జెడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్ పర్సన్ అవిశ్వాస తీర్మానం, సభ్యుల అనఅర్హత, జిల్లా పరిషత్ బడ్జెట్, మౌలిక సదుపాయాల కల్పన, జిల్లా పరిషత్ పాత్ర, నిధులు ఆదాయం, ఖర్చులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, విధి విధానాలు, వ్యవసాయ శాఖ, పశు సంవర్ధక శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, మహిళ శిశు సంక్షేమ శాఖ, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో జెడ్పీటీసీ సభ్యుల పాత్ర గురించి వివరించారు. జెడ్పీటీసీ సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు, ఏఓ జి.శ్రీనివాసరావు, డీఓ షేక్ జమీఉల్లా, డీఎల్‌డీఓ సిహెచ్.సువార్త, డీఈ ఈసీ విజయ్ కుమార్, డీఈఓ పి.వి.జె.రామారావు, ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ స్వరూప శోభారాణి పాల్గొన్నారు.



జెడ్పీటీసీ సభ్యులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

దేవుని ముందు అందరూ సమానులే

త్రిదండి చినజీయర్ స్వామి



భక్తులకు సందేశాన్ని వినిపిస్తున్న చిన జీయర్ స్వామి

పర్చూరు(చినగంజాం): దేవుని ముందు అందరూ సమానులేనని, పక్షపాతం వహించే వాడు దేవుడు అనిపించుకోడని సమతా మూర్తి పీఠాధిపతి త్రిదండి చినజీయర్ స్వామి అన్నారు. బుధవారం పర్చూరులోని అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని ఆయన ప్రారంభించారు. కల్యాణ మండపానికి ఆలా అనిల్ కుమార్ దంపతులు రూ.15 లక్షలు ఆర్థిక సాయాన్ని అందించగా నిర్మాణం పూర్తి చేశారు. చినజీయర్ స్వామి మాట్లాడుతూ ఆంజనేయ స్వామి విగ్రహం లేని ఊరు లేదని, రెండు తెలుగు రాష్ట్రాల్లో అన్ని ప్రాంతాల్లో ఆంజనేయ స్వామి విగ్రహాలు ఉన్నాయని అన్నారు. మానవ సేవే మాధవ సేవ గురించి భక్తులకు వివరించారు. భగవంతుడు అందరినీ సమాన దృష్టితో చూస్తాడని, గిరిజన మహిళ శబరి ఇచ్చిన పండ్లను కూడా రాముడు స్వీకరించాడని ఆయన వివరించారు. ఆంజనేయుడు కోతి రూపంలో ఉన్నప్పటికీ రాముడు అతడిని తన చిరకాల మిత్రుడిగా ఆలింగనం చేసుకున్నాడని అన్నారు. రాముడి కోసం ప్రాణత్యాగం చేసిన పక్షి జటాయువును రాముడు మర్చిపోలేదని తెలిపారు. ప్రకృతిలో అన్ని జల, జీవరాశుల వినాశనానికి మనిషి కారణమవుతుండటంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతిని మానవుడు కలుషితం చేస్తున్నాడన్నారు. అనంతరం కమిటీ సభ్యులు చిన్నజీయర్ స్వామిని సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కోట హరి ప్రసాద్, రంగిశెట్టి ఆంజనేయులు, తులసి శివనాగేశ్వరరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, గాజుల రమేష్, తులసి భాస్కర్, భువనేశ్వరరావు, కోడూరి శివబ్రహ్మచారి పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

బాపట్ల జేసీ శ్రీధర్



తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న సంయుక్త కలెక్టర్ శ్రీధర్

కర్లపాలెం: గ్రామ సచివాలయాల ద్వారా పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలందించాలని బాపట్ల జిల్లా సంయుక్త కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. పాతనందాయపాలెం గ్రామ సచివాలయాన్ని, ఎస్‌డబ్ల్యూ పీసీ షెడ్డును బుధవారం తనిఖీ చేశారు. సచివాలయం రికార్డులను పరిశీలించి సిబ్బంది హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సచివాలయాలకు వచ్చే ప్రజలపై సిబ్బంది గౌరవభావంతో మసలుకుంటూ వారి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. తడిచెత్త, పొడిచెత్త సేకరించి వర్మి కంపోస్టు తయారు చేసుకోవటం, ఘన పదార్థాలను విక్రయించటం ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో జరిగిన సమావేశంలో శ్రీధర్ మాట్లాడుతూ మండల పరిధిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి, ఇసుక తరలించే వారిపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు తమ పొలాల్లో మరమ్మతులు చేసే మట్టి పనులను అడ్డుకోవద్దని వీఆర్వోలకు సూచించారు. రీ సర్వే పనులు వేగవంతం చేయాలని, రెవెన్యూ రికార్డులు తాజా పరుచుకోవాలని చెప్పారు. చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించిన ఆయన నాణ్యతగా పనులు చేయించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.కేశవనారాయణరావు, ఎంపీడీఓ డి.రాంబాబు, ఈఓపీఆర్డీ ఎలీషాబాబు, హౌసింగ్ ఏఈ అన్వర్ బాషా, ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి డి.పద్మావతి ఉన్నారు.

రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులో కాంపోనెంట్స్ స్టోరేజ్ సెంటర్

రేపల్లె: రేపల్లె ప్రభుత్వ వైద్యశాల ఆవరణలోని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌లో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న బ్లడ్ కాంపోనెంట్స్ స్టోరేజ్ సెంటర్ ప్రారంభించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించిందని రేపల్లె బ్రాంచి చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య తెలిపారు. స్థానిక కార్యాలయంలో బ్లడ్ బ్యాంక్ కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. మచిలీపట్నం రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ మదర్ బ్లడ్ బ్యాంక్‌గా రేపల్లెలో ఈ సెంటర్ ఏర్పాటు కానుందని చెప్పారు. దీనికి అవసరమైన యంత్ర సామగ్రి, అవసరమైన లైసెన్సులు వచ్చాయన్నారు. బ్లడ్ కాంపోనెంట్ స్టోరేజ్ రావటంతో రక్తంలోని లిక్విడ్‌లను, సెల్స్‌ను వేరుచేసి రక్త కణాలను భద్రపరిచే వీలుంటుందని చెప్పారు. రక్తం అవసరమైన క్షతగాత్రునికి రక్తం కాకుండా సెల్స్ అందించటంతో దుష్ప్రభావాలు చోటు చేసుకోవన్నారు. తీర ప్రాంత ప్రజలకు బ్లడ్ బ్యాంక్ సేవలను మరింత మెరుగ్గా అందించవచ్చని పేర్కొన్నారు.

నేటి నుంచి వ్యవసాయ కళాశాల వార్షికోత్సవం

బాపట్ల: బాపట్ల వ్యవసాయ కళాశాల వార్షికోత్సవం, హాస్టల్ దినోత్సవ వేడుకలు గురు, శుక్రవారం నిర్వహించనున్నట్లు కళాశాల డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈమేరకు బుధవారం స్థానిక కళాశాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టరు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వేడుకల్లో ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టరు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాతో పాటు డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టరు పి.సుధాకర్, చైతన్య గోదావరి బ్యాంకు చైర్మన్ టి.కామేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సంచిక హరిత- 2023ని ఆవిష్కరించి, వివిధ క్రీడల్లో ప్రవీణ్యత చూపిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు.

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య



దొనకొండ(దర్శి టౌన్): రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమైన ఓ మహిళ చివరి క్షణంలో మనసు మార్చుకుని తప్పించుకునేందుకు చేసిన ప్రయత్నం విఫలమైంది. రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృత్యువాత పడింది. ఈ విషాద ఘటన మంగళవారం అర్ధరాత్రి దొనకొండ రైల్వే స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం.. వినుకొండ పట్టణం దేవానగర్‌కు చెందిన పగడాల బుజ్జి(52) భర్త వీరయ్య 20 ఏళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో కుటుంబ పోషణ భారం ఆమెపై పడింది. వెల్లుల్లి, ఇతర వస్తువులు విక్రయిస్తూ తన ఇద్దరు కుమార్తెలు, కుమారుడిని పెంచి పెద్ద చేసింది. అందరికీ వివాహాలు చేసింది. ఏం కష్టమొచ్చిందో తెలియదు కానీ మంగళవారం రాత్రి ఓ సంచిలో దుస్తులు పెట్టుకుని దొనకొండ రైల్వే స్టేషన్‌కు చేరింది. అర్ధరాత్రి దాటిన తర్వాత కొండవీడు ఎక్స్‌ప్రెస్ వస్తున్న సమయంలో రైల్వే ట్రాక్‌పై కొంత సేపు నిలబడింది. చివరి క్షణంలో ఆత్మహత్యాయత్నాన్ని విరమించుకున్న ఆమె రైల్వే ట్రాక్ నుంచి పక్కకు తప్పుకునే క్రమంలో వేగంగా వస్తున్న ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. లోకో పైలట్ ఇచ్చిన సమాచారంతో రైల్వే ఎస్ఐ సుబ్బారావు, దొనకొండ రైల్వే పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి పూర్ణమహేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ రైల్వేస్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్ పురస్కారానికి సీజీజీబీ నామినేట్

కొరిటెపాడు(గుంటూరు): పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) నుంచి అటల్ పెన్షన్ యోజన పథకం కింద 2022-23 ఆర్థిక సంవత్సరానికి చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ వార్షిక అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్ అందుకోవడానికి నామినేట్ అయిందని సీజీజీబీ చైర్మన్ టి.కామేశ్వరరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2015 మే నెల 9వ తేదీన పెన్షన్ స్కీం అయిన అటల్ పెన్షన్ యోజన ప్రారంభించిందన్నారు. పీఎఫ్ఆర్‌డీఏ వారు బుధవారం న్యూఢిల్లీలో ఏపీవై వార్షిక అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారని, ఇందులో ఏపీవై వార్షిక అవార్డుల విజేతలను సత్కరించారని తెలిపారు. భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి డాక్టర్ వివేక్ జోషి హాజరు కాగారు. పీఎఫ్ఆర్‌డీఏ చైర్మన్ దీపక్ మొహంతి, బ్యాంకు ఏలూరు రీజనల్ మేనేజర్ జీఎస్ఎన్ సతీష్‌కుమార్, సీనియర్ మేనేజర్ మహమ్మద్ మజీద్‌లు అవార్డు అందుకున్నట్లు చెప్పారు.

షూటింగ్‌లో ముఖేష్‌కు కాంస్యం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భోపాల్‌లో జరుగుతున్న కుమార్ సురేంద్ర సింగ్ మెమోరియల్ నేషనల్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో గుంటూరుకు చెందిన నేలవల్లి ముఖేష్ కాంస్య పతకం సాధించాడని ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్ చీఫ్ కోచ్ ఎస్.సుబ్రమణ్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ విభాగంలో 600 పాయింట్లకు గానూ 576 సాధించాడు. ప్రథమ, ద్వితీయ స్థానాలను తమిళనాడుకు చెందిన హర్‌సిమార్ సింగ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇషాన్ ఖాన్ కైవసం చేసుకున్నారు. ముఖేష్ ఇప్పటికే జాతీయ పోటీల్లో పతకాలు సాధించాడు. భారత శిక్షణ బృందంలో సభ్యునిగానూ ఉన్నాడు.

